ఆలస్యంగా బస్సు.. తరగతులు మిస్సు

- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- సకాలంలో రాక ఇంటిబాట
- ఆందోళనలో తల్లిదండ్రులు, విద్యార్థులు


మోడల్ స్కూల్‌కు వెళ్లడానికి ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

రామడుగు: పిల్లలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్‌కు పంపిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఆశించిన విద్యార్థుల తల్లిదండ్రులకు నిరాశే ఎదురవుతోంది. ఆర్టీసీ అధికారుల తీరుతో నిత్యం ఇబ్బందిపడాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. మోడల్ స్కూల్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు ఆలస్యంగా వస్తుండటంతో విద్యార్థులు పాఠశాలకు సకాలంలో చేరుకోలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు ముఖ్యమైన తరగతులు మిస్సవుతున్నారు. బస్సు రాకపోవడంతో కొందరు విద్యార్థులు విధిలేని పరిస్థితిలో ఇంటిదారి పట్టాల్సిన దుస్థితి రామడుగు మండలం వెదిరలో నెలకొంది.

ఆరునెలల క్రితం ప్రత్యేక బస్సు

రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్‌కు వెదిర వీడీసీ చైర్మన్ నాగుల రాజశేఖర్‌గౌడ్ రామడుగు మోడల్ స్కూల్‌కు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని కొద్దిరోజుల క్రితం వినతిపత్రం అందజేశారు. దీంతో ఆర్టీసీ అధికారులు వెదిర నుంచి దాదాపుగా ఆరునెలల క్రితం కరీంనగర్ –2 డిపో నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు. దాదాపు 70 మందికి పైగా విద్యార్థులను తల్లిదండ్రులు స్కూల్‌కు పంపిస్తున్నారు.

ఆర్టీసీ అధికారుల నిర్ణయం శాపం...

నెలరోజుల క్రితం ఆర్టీసీ అధికారులు వెదిర నుంచి మోడల్ స్కూల్‌కు విద్యార్థులను తీసుకెళ్లడానికి బస్సును కరీంనగర్–2 డిపో నుంచి జగిత్యాల డిపోకు మార్చారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయని, జగిత్యాల డిపో నుంచి బస్సు నిత్యం ఆలస్యంగా వస్తుండటంతో పాఠశాలకు సకాలంలో పిల్లలు వెళ్లలేకపోతున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా కొన్నిసార్లు బస్సు రాకపోవడంతో పిల్లలు ఇంటికి వస్తున్నారని ఓ విద్యార్థి తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా...బస్సు సకాలంలో రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని, పట్టించుకునేవారు కరువయ్యారని మరో విద్యార్థి తండ్రి తెలిపాడు. బస్సు సమయానికి రాకపోవడంతో పిల్లల పరిస్థితి దయనీయంగా మారిందని వాపోతున్నారు. వారం రోజులుగా పరిస్థితి మరీ దారుణంగా ఉందని విద్యార్థులు తెలిపారు. రామడుగు సమీపాన మోతె వాగుపై బ్రిడ్జి పనుల కారణంగా బస్సు రావడంలేదని, దీంతో పాఠాలు వినలేకపోతున్నామని, ఆర్టీసీ అధికారులు సకాలంలో బస్సు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇబ్బందిపడుతున్నం



మోడల్ స్కూల్ వరకు ఊరి నుంచి బస్సు నడిపించడంతో అందరం వెళ్లే వాళ్లం. నెలరోజుల నుంచి బస్సు టైమ్‌కు రాకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. టైమ్‌కు స్కూల్‌కు వెళ్లకపోవడంతో ముఖ్యమైన పాఠ్యాంశాలను కోల్పోతున్నాం. అధికారులు టైమ్‌కు బస్సు నడిపించాలని కోరుతున్నాం.

– హాసిని, పదోతరగతి, వెదిర

సకాలంలో నడిపించాలి



ఊరి నుంచి మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సు సకాలంలో రాకపోవడంతో పిల్లలు చాలా ఇబ్బందిపడుతున్నారు. బస్సు రాకపోతే ఇంటికి వస్తున్నారు. అ లాగే ఆలస్యంగా వస్తుండటంతో పిల్లలకు నష్టం కలుగుతోంది. ఆర్టీసీ అధికారులు ఇబ్బంది గుర్తించి బస్సును సకాలంలో నడిపించాలి.

– మహేందర్, విద్యార్థి తండ్రి, వెదిర

తెలంగాణను కేసీఆర్ సర్వనాశనం చేశారు

- ఎంపీ బండి సంజయ్‌కుమార్

సైదాపూర్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, బీజేపీ గ్రాఫ్ పెరుగుతోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని ఆకునూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, మహనీయుల విగ్రహావిష్కరణ చేశారు. కేసీఆర్ తెలంగాణను సర్వనాశనం చేశాడు, అరాచకపాలన అంతమొందించడం బీజేపీతోనే సాధ్యమని, అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబ అవినీతి బయట పడుతుందన్నారు. జమిలీ ఎన్నికలు వస్తాయని ఎవరన్నారు? ప్రధాని మోదీ అనలేదు, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అనలేదు. ఎన్నికల విషయం ఎన్నికల కమిషన్ చూసుకుంటుంది. జమిలీ ఎన్నికలపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతున్నారు. ఇద్దరు కలిసి బీజేపీ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్‌లో గెలిచినవాళ్లు బీఆర్‌ఎస్‌లో చేరి మంత్రులయ్యారు. గత ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు వచ్చాయా? బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మేదిలేదు. ఉన్నది బీజేపీ మాత్రమే. మోదీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. కల్వకుంట్ల కవిత అరెస్టు ఈడీ చూసుకుంటుంది. ఈడీకి, బీజేపీకి సంబంధం లేదు. బీజేపీ శ్రేణులు అధికారమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీరాంచక్రవర్తి, సురేందర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ లక్ష్మారెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌రెడ్డి, సర్పంచ్ ముత్యాల రమణారెడ్డి, ఎంపీటీసీలు జెల్ల మల్లేశం, సంతోష్, విజయ, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోషణ వారోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణవారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుధారాణి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిత్యం తీసుకోనే ఆహారంలో జొన్నలు, సజ్జలు, రాగులు చేర్చి తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవనం సాగించే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ కోఆర్డినేటర్ కర్ణాకర్, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యరాణి, సునీత, సీఏ మౌనిక, స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్‌చౌక్ సమీపంలో గురువారం ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. యువత ఓటుహక్కు ప్రాధాన్యతను స్థానికులకు వివరించాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ నిర్మల, కమిషనర్ సమ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

రామడుగు: పద్దెనిమిదేళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఓటరుగా నమోదుకు 19వ తేదీ వరకు అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతిచెందినవారి పేర్లు తొలగించాలి

ఇల్లందకుంట: ఓటరు జాబితాలో నుంచి మృతిచెందినవారి పేర్లు తొలగించాలని హుజూరాబాద్ ఆర్డీవో రాజు అధికారులకు సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరులిస్టులో చేర్పులు మార్పులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించడంలో పూర్తి బాధ్యతతో పనిచేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, చనిపోయినవారి పేర్లు డెత్ సర్టిఫికెట్ ఆధారంగానే తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాణి, డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

శంకరపట్నం: మండలంలోని అంబాల్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఎండీ. రహీం గురువారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సర్పంచ్, ఎస్సారెస్పీ సాగునీటి సంఘం చైర్మన్, ఎంపీటీసీ, మండల పరిషత్‌కోఆప్షన్ మెంబర్‌గా పనిచేశానని, రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు గడిచినా మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయడంలేదని ఆరోపించారు. మైనార్టీలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మేలుజరగదని భావించి పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుకు అందజేస్తానన్నారు.

కిచెన్ షెడ్డును పరిశీలించిన ఎంపీపీ


కిచెన్ షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ కవిత

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మనఊరు –మనబడి పథకంలో నిర్మించిన కిచెన్ షెడ్డును గురువారం ఎంపీపీ కలిగేటి కవిత పరిశీలించారు. నిర్మాణం పూర్తి చేసినప్పటికి బిల్లు రావడంలేదని కాంట్రాక్టర్ తెలపడంతో ఈఈ శ్రీనివాస్‌రావును బిల్లు చెల్లింపు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం మండల కన్వీనర్ ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రకాశ్, విద్యా కమిటీ చైర్మన్ బుర్ర సాయిలుగౌడ్ పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి


బండారి రమేశ్

తిమ్మాపూర్: సొంతస్థలం ఉన్నవారు ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ప్రారంభించిన గృహలక్ష్మి పథకంలో లబ్ధిదారుల ఎంపిక పాదర్శకంగా జరగాలని గురువారం మండలంలోని పోలంపల్లి ఎంపీటీసీ బండారి రమేశ్ డిమాండ్ చేశారు. గ్రామంలో అర్హులను కాదని బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఎంపిక చేస్తున్నారని, నిరుపేదలు సొంతింటి కల నెరవేరుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఎమ్మెల్యే రసమయి పారదర్శక చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులు, సామాన్యులకు అన్యాయం చేసి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు మేలు చేయడం సరికాదన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు


ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి: మండలంలోని రాగంపేట గ్రామంలో ముదిరాజ్, యాదవ కమ్యూనిటీ భవనాలకు రూ. 4.60 లక్షల చొప్పున, మహిళా సంఘం భవనానికి రూ. 4 లక్షలు మంజూరయ్యాయి. గురువారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గ్రామస్తులకు ప్రొసీడింగ్స్ అందించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో రాజేశం, బాలకిషన్, శంకర్, భూమయ్య, లక్ష్మిరాజం, రాజయ్య, విజయ, లత, అజిత, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి


నవాబుపేట్‌లో పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రసన్న

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్, ఇందుర్తి ఆరోగ్య ఉపకేంద్రాల్లో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. మలేరియా, డెంగీ, తదితర వ్యాధుల రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. నవాబుపేట్ ఆరోగ్య ఉపకేంద్రం పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్ ప్రసన్న మాట్లాడుతూ...సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, మురుగునీటిలో దోమలు ప్రబలే అవకాశం ఉందన్నారు. 142 మందికి పరీక్షలు చేయగా 20 మందిలో మలేరియా, డెంగీ లక్షణాలు కనపబడినట్లు తెలిపారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, హెల్త్ సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.

గుట్టపై తవ్వకాలకు అనుమతివ్వొద్దు


మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

చిగురుమామిడి: సైదాపూర్ మండలం సర్వాయిపేటలోని సాయుధపోరాట వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న కోట(గుట్ట)పై గ్రానైట్ బకాసురుల కన్నుపడింది, ఎట్టి పరిస్థితుల్లోనూ తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని గౌడ సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం చిగురుమామిడి రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మండలశాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి మాట్లాడుతూ.. గ్రానైట్ తవ్వకాలకు అనుమతిస్తే చారిత్రాత్మక కట్టడాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, గుట్టపై నక్కల బండ, బుసనాగట్లు, పాపన్న చెరువు, కోటగడులు, బయన్నగుడి, అయ్యప్పస్వామి టెంపుల్, తదితర ఆనవాళ్లు ఇప్పటికీ చెక్కు చెదరలేదన్నారు. గ్రానైట్ ఏర్పాటు, క్వారీ తవ్వకాలకు ముందుకు వస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. పాపన్న గుట్టను ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. సమావేశంలో గౌడ సంఘం మండల ఉపాధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్, యువజన విభాగం మండల అధ్యక్షుడు ముంజ ప్రకాశ్‌గౌడ్, నాయకులు బండారుపల్లి చంద్రయగౌడ్, రాజుగౌడ్, రాజయ్యగౌడ్, రాములు, భాస్కర్, రాజ్‌కుమార్, సమ్మయ్య, తిరుపతి, రాయమల్లు, అంతయ్య, కనకయ్య పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల రాస్తారోకో


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

మానకొండూర్: మండల కేంద్రంలో కరీంనగర్–వరంగల్ రహదారిపై గురువారం బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతిచెల్లించాలని, ఉద్యోగాలను భర్తీచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేస్తున్న దీక్షను భగ్నంచేసి, అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా రాస్తారోకో చేశామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, నాయకులు లక్ష్మణాచారి, రమణ, శ్రీనివాస్, చిరంజీవి, ప్రభాకర్‌గౌడ్, ఆంజనేయులు, తేజ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శాంతియుత ధర్నాను పోలీసులు భగ్నం చేయడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రాస్తారోకో చేశారు. దీంతో అరగంటసేపు రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్, నాయకులు సరేందర్, శివారెడ్డి, శ్రీనివాస్, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌సెంటర్ సందర్శన


పరిశీలిస్తున్న అధికారులు

శంకరపట్నం: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎరడపల్లి సబ్‌సెంటర్‌ను ఎన్‌క్యూఏఎస్ టీం గురువారం పరిశీలించింది. కార్యక్రమంలో టీంసభ్యులు డాక్టర్లు శీల్‌దేవేంద్ర, చౌహాన్, సౌమిత్ర ధావన్, డిప్యూటీ డీఎమ్ అండ్‌హెచ్‌ఓ చందు, వైద్యాధికారి వేణుగోపాల్, సురేశ్, రవీందర్, ప్రతాప్, సర్పంచ్ రంజిత్‌రావు, వైద్యసిబ్బంది కౌసల్య తదితరులున్నారు.

సర్పంచుల ఫోరం సైదాపూర్ మండల అధ్యక్షుడిగా గణేశ్

సైదాపూర్: సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా వెన్కెపల్లి సర్పంచ్ కొండా గణేశ్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో అధ్యక్షుడిగా కొనసాగిన సైదాపూర్ సర్పంచ్ చందా శ్రీనివాస్‌పై వ్యతిరేకతతో హుజూరాబాద్‌లో కొండా గణేశ్ నివాసంలో సమావేశమై మండల సర్పంచులు చందా శ్రీనివాస్‌ను తొలగిస్తున్నట్లు తీర్మానం చేశారు. నూతన అధ్యక్షుడిగా గణేశ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికలో సర్పంచులు, కొత్త రాజిరెడ్డి, గాజర్ల సదానందం, ఏనుగుల ఐలయ్య, ఆవునూరి పాపయ్య, బత్తుల కొమురయ్య, బొడిగ పద్మజ, కందుల విజయ, అబ్బిడి పద్మ, చింత లత, మిడిదొడ్డి సరిత, చిట్టి ప్రత్యూష, రేగుల సుమలత, తొంట కాంతమ్మ, మ్యాకల శిరీష, గుండేటి సునీతారాణి, పైడిమల్ల సుశీల పాల్గొన్నారు. మహిళా సర్పంచులకు బదులు భర్తలు పాల్గొనడం విశేషం.

సభ్యత్వ నమోదు


సభ్యత్వం ఇస్తున్న రంగారావు

వీణవంక: ఉపాధ్యాయుల పదోన్నతి, బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నమేనేని రంగారావు అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని, పదోన్నతి వద్దనుకునే వారి నుంచి అంగీకారం తీసుకొని తర్వాత పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ బాధ్యులు పోలు సత్యనారాయణ, రవికిరణ్, సత్యనారాయణరావు, శివకుమార్ ఉన్నారు.

కేజీబీవీలో హిందీ దివస్


వివిధ కళాకృతులతో విద్యార్థులు


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్ కేజీబీవీలో గురువారం హిందీ దివస్‌ను స్పెషల్ ఆఫీసర్ స్వప్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాసపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని చిన్నకోమటిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. హిందీ టీచర్ భూక్య కవిత ఆధ్వర్యంలో విద్యార్థులు హిందీ భాషా ప్రాముఖ్యతను తెలియజేసేలా వివిధ కళాకృతులను తయారుచేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సరోజినిదేవి మాట్లాడుతూ... జాతిపిత గాంధీజీ స్వాతంత్ర్య సమరంలో హిందీభాషను ఆయుధంగా చేసుకొని దేశంలో ఐక్యత తీసుకురావడంలో సఫలీకృతమయ్యారని పేర్కొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగుల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హిందీ టీచర్ విజయలక్ష్మి భాషా గొప్పతనం, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు హిందీ భాషపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారద, నాగిరెడ్డి మమత, సమ్మయ్య, తిరుపతి, విజయలక్ష్మి, నందన పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తిమ్మాపూర్: మైనార్టీ సంక్షేమశాఖ, కార్పొరేషన్ ఆధ్వర్యంలో మానకొండూర్ నియోజకవర్గంలోని మైనార్టీ మహిళలకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గురువారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, కేసీఆర్ చొరవతో అందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై కోతుల దాడి

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లిలో గురువారం అంగన్వాడీ టీచర్ గుంటి తిరుపతమ్మ పాఠశాలలో విధులు నిర్వహిస్తుండగా కోతులు దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. దాడిలో తీవ్ర గాయాలతోపాటు చేయి విరిగింది. వెంటనే 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అంగన్‌వాడీ, ప్రైమరీ, ఉన్నత పాఠశాల పరిసరాల్లో కోతుల గుంపు నిత్యం సంచరిస్తూ, విద్యార్థులను, టీచర్లను భయబ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతుల బెడద నివారణకు పంచాయతీ సిబ్బంది, పాలకులు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ కెనాల్‌లో వ్యక్తి గల్లంతు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగపూర్ గ్రామ శివారు ఎస్సారెస్పీ కెనాల్‌లో గురువారం వ్యక్తి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన చిదురుల రాజేందర్(36) పని నిమిత్తం సింగపూర్‌కు వచ్చి తిరుగు ప్రయాణంలో ఎస్సారెస్పీ కెనాల్ వద్ద బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడిపోయాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా గాలింపు చర్యలు చేపట్టారు.

కాంగ్రెస్‌లో చేరిక

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ విధానాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున మహిళలు పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బసవయ్య, మల్లారెడ్డి, రాజిరెడ్డి, ఇసామొద్దీన్ పాల్గొన్నారు.

విజయభేరి సభను విజయవంతం చేయాలి

వీణవంక: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 17న హైదరాబాద్‌లో నిర్వహించే విజయభేరి సభను విజయవంతం చేయాలని టీపీసీసీ సభ్యుడు కర్ర భగవాన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నేత సోనియా గాంధీ హాజరయ్యే సభకు కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ప్రతి కార్యకర్త రాబోయే ఎన్నికల్లో సైనికుడిలా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగురు సదయ్య, సీనియర్ నాయకులు గంగాడి రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

అయోధ్య టూ శ్రీలంక పాదయాత్ర


పూజలు చేస్తున్న సబిందర్‌సింగ్

ఇల్లందకుంట: రాముని పై ఉన్న భక్తితో రామ జన్మభూమి అయోధ్య నుంచి శ్రీలంక వరకు చేపట్టిన ఓ యువకుడి పాదయాత్ర గురువారం ఇల్లందకుంటకు చేరింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యకు చెందిన సబిందర్‌సింగ్ రాముడు వనవాసం చేస్తూ సంచరించిన దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించారు. మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు దేశంలోని 10 రాష్ట్రాల్లో ప్రాంతాలను సందర్శించనున్నట్లు తెలిపారు.